మా కలం.. మీ గళం..

# మన గళం

దిన పత్రిక

RNI : APTEL/ 2017/74310

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ | పబ్లిషర్ : నగరూరు రాఘవేంద్ర | సంపుటి : 08 | సంచిక : 209 | మంగళవారం | 03 - 02 - 2026 | పేజీలు: 8 | వెల: 4

## నాబార్డ్ నిధులతో రహదారి పనుల పరిశీలన : కందుల దుర్గేష్



2 లో..



## నక్సలిజంపై పోరాటానికి
# రూ.3,610 కోట్లు

- మార్చి 31ని డెడ్‌లైన్‌గా ప్రకటించిన కేంద్రం
- 20 శాతానికిపైగా పెరిగిన నిధుల కేటాయింపు
- భద్రత, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి

మన గళం, న్యూఢిల్లీ : దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు కేంద్ర ప్రభుత్వం గట్టి నిర్ణయం తీసుకుంది. మార్చి 31ని డెడ్‌లైన్‌గా పేర్కొంటూ, నక్సలిజంపై పోరాటానికి ఈసారి కేంద్ర బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించింది. తాజా బడ్జెట్ ప్రతిపాదనల ప్రకారం వామపక్ష తీవ్రవాదాన్ని తుదముట్టించేందుకు రూ.3,610 కోట్లు ఖర్చు చేయనున్నట్లు ప్రకటించింది. నక్సలిజం ప్రభావిత ప్రాంతాల్లో భద్రతా బలగాల కార్యకలాపాలు, పోలీసింగ్ వ్యయం, కేంద్ర సాయుధ బలగాల మోహరింపు వంటి 2 లో..

## చైనాలో నలుగురికి
# ఉరిశిక్ష



- బాయి ఫ్యామిలీ మాఫియాపై కఠిన చర్యలు
- ఆరుగురు చైనీయుల మరణానికి కారణమన్న కోర్టు
- గ్యాంగులపై చైనా ఉక్కుపాదం

మన గళం, బీజింగ్ : మయన్మార్‌ను కేంద్రంగా చేసుకుని చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న కారణంతో నలుగురికి చైనాలో ఉరిశిక్ష అమలైంది. బాయి ఫ్యామిలీ మాఫియాకు చెందిన ఈ నలుగురిపై మరణశిక్షను అమలు చేసినట్లు షెంజెన్ ఇంటర్మీడియేట్ పీపుల్స్ కోర్టు అధికారికంగా వెల్లడించింది. హత్యలు, టెలికాం మోసాలు, డ్రగ్ ట్రాఫికింగ్‌తో పాటు ఆరుగురు చైనీయుల మరణానికి కారణమైనట్లు నిర్ధారణ 2 లో..

## హిందూ దళితులకు
# ఇండ్లు ఇవ్వాలి

- కేవలం పౌరసత్వం సరిపోదన్న ధర్మాసనం
- గౌరవంగా జీవించే హక్కు కల్పించాలని ఆదేశం
- నివాసాల తొలగింపులు నిలిపివేయాలని సూచన
- నాలుగు వారాల్లో కేంద్రం సమాధానం ఇవ్వాలి



మన గళం, న్యూఢిల్లీ : పాకిస్తాన్ నుంచి వలస వచ్చి భారత్‌లో నివసిస్తున్న హిందూ దళితులకు ప్రభుత్వం తప్పనిసరిగా ఇండ్లు కేటాయించాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. కేవలం భారత పౌరసత్వం ఇవ్వడం సరిపోదని, గౌరవంగా జీవించే అవకాశం కల్పించాల్సిన బాధ్యత కేంద్రానిదేనని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్రానికి కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసుపై విచారణ జరిపిన జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ ఎన్. కోటేశ్వర్ సింగ్ లతో కూడిన ధర్మాసనం సోమవారం ఈ వ్యాఖ్యలు చేసింది. పాకిస్తాన్ నుంచి వలస వచ్చిన హిందూ దళితులు ప్రస్తుతం ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారని కోర్టు గుర్తించింది. ముఖ్యంగా మజ్ను 2 లో..

## మహాశివరాత్రి పర్వదిన వేడుకలను సమన్వయంతో
# విజయవంతం చేయాలి

- ఆధ్యాత్మిక ఆంధ్రప్రదేశ్‌కు శ్రీకారం
- భక్తులకు సౌకర్యవంతమైన, సంతృప్తికరమైన దర్శనం కల్పించాలి
- అధికారులను ఆదేశించిన మంత్రుల బృందం

మనగళం, శ్రీశైలం : శ్రీశైల మహా పుణ్యక్షేత్రంలో నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను భక్తుల మనోభావాలకు అనుగుణంగా, భక్తి పారవశ్యంతో సజావుగా నిర్వహించాలని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా చేపట్టాలని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. శ్రీశైలంలోని సదాశివయ్య భవన్‌లో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, హోం శాఖ మంత్రి శ్రీమతి వంగలపూడి అనిత, రోడ్లు భవనాలు, మౌలిక సదుపాయాలు మరియు పెట్టుబడుల శాఖ మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, ఎక్స్-ఆఫిషియో ప్రిన్సిపల్ సెక్రటరీ హరి జవహర్ లాల్, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి కలిసి సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, శ్రీశైలం దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు, ట్రస్ట్ బోర్డు చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు, శ్రీశైలం, ఆత్మకూరు డీఎఫ్‌వోలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ట్రస్ట్ బోర్డు సభ్యులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ, మహాశివరాత్రి పర్వదిన వేడుకల సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వహణ, దర్శన ఏర్పాట్లు, వసతి, భద్రత, పారిశుద్ధ్యం వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులకు సూచించారు. గత సంవత్సరం ఎదురైన లోపాలను సవరించడంతో పాటు, సంభవించే సమస్యలను ముందుగానే అంచనా వేసి పరిష్కార మార్గాలు సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. ఎస్ఓపీని 2 లో..





## బంగ్లా జైలు నుంచి విడుదలైన
# ఏపీ మత్స్యకారులు

- ఆరు నెలల తర్వాత స్వదేశానికి చేరిక
- ఇండియన్ కోస్ట్ గార్డ్ పర్యవేక్షణలో విశాఖకు తరలింపు

మన గళం, అమరావతి : సరిహద్దు దాటారనే ఆరోపణలతో గత ఆరు నెలలుగా బంగ్లాదేశ్ జైలులో ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మత్స్యకారులు సురక్షితంగా స్వదేశానికి చేరుకున్నారు. గత ఏడాది అక్టోబర్‌లో వేటకు వెళ్లిన తొమ్మిది మంది మత్స్యకారులు అనుకోకుండా బంగ్లాదేశ్ సముద్ర సరిహద్దు దాటడంతో అక్కడి నేవీ అధికారులు వారిని అదుపులోకి తీసుకుని అరెస్టు 2 లో..

## శ్రీశైలంలో స్వామివారిని దర్శించుకున్న మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి



మనగళం శ్రీశైలం : శ్రీశైలంలో శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివారిని దర్శించుకున్న ఆర్ అండ్ బి శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి నేటి ఉదయం శ్రీశైలం విచ్చేసిన మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి స్వాగతం పలికిన ఆలయ ఈవో ఏం. శ్రీనివాసరావు, ఛైర్మెన్ పోతుగుంట రమేష్ నాయుడు



అనంతరం వేద పండితుల నుంచి వేదాశీర్వచనం అందుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించిన మంత్రి. రాష్ట్ర ప్రజలందరికీ శ్రీశైలం మల్లన్న ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించిన మంత్రి బ్రహ్మోత్సవాల కోసం జరుగుతున్న ఏర్పాట్లపై ఆరా తీసిన మంత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచన

## వైసీపీ కుట్రలను
# తిప్పికొడదాం

- చంద్రబాబు ఆదేశాలతో టీడీపీ నేతల టెలీకాన్ఫరెన్స్



మన గళం, అమరావతి : ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని అడ్డుకునే వైసీపీ కుట్రలను తిప్పికొట్టాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తో కలిసి పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించినట్లు ఆయన 2 లో..

## నక్సలిజంపై పోరాటానికి రూ.3,610 కోట్లు

అంశాలకు ఈ నిధులను వినియోగించనున్నారు. అలాగే ప్రత్యేక మౌలిక వసతుల అభివృద్ధి పథకాల కోసం కూడా ఈ మొత్తాన్ని రాబోయే ఆర్థిక సంవత్సరంలో ఖర్చు చేయనున్నట్లు కేంద్రం తెలిపింది. గత ఆర్థిక సంవత్సరంలో (సవరించిన అంచనాల ప్రకారం) నక్సలిజంపై పోరాటానికి రూ.3,006 కోట్లు ఖర్చు చేసినట్లు కేంద్రం వెల్లడించింది. తాజా బడ్జెట్‌లో ఈ వ్యయాన్ని 20 శాతానికి పైగా పెంచుతూ రూ.3,610 కోట్లకు చేర్చడం గమనార్హం. ఇది నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో కేంద్రం తీసుకుంటున్న కఠిన వైఖరిని స్పష్టంగా చూపుతోంది. నక్సలిజం నిర్మూలనతో పాటు ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడం, ప్రజల్లో భద్రతా భావన పెంపొందించడం కూడా కేంద్ర లక్ష్యంగా పెట్టుకున్నట్లు బడ్జెట్ ప్రతిపాదనలు సూచిస్తున్నాయి.

## చైనాలో నలుగురికి ఉరిశిక్ష



కావడంతో గత ఏడాది కోర్టు వీరికి మరణశిక్ష విధించింది. తాజాగా ఆ శిక్షను అమలు చేసినట్లు చైనా అధికారులు తెలిపారు. అయితే ఉరిశిక్షను ఖచ్చితంగా ఎప్పుడు అమలు చేశారన్న వివరాలను వెల్లడించలేదు. ఆన్‌లైన్ మోసాలు, జూద కార్యకలాపాలు, భారీ ఆర్థిక నేరాలకు పాల్పడుతున్న అంతర్జాతీయ గ్యాంగులపై చైనా ప్రభుత్వం కొంతకాలంగా కఠిన వైఖరి అవలంబిస్తోంది. ఇందులో భాగంగానే మయన్మార్‌కు చెందిన నేర ముఠాలపై కూడా ఉక్కుపాదం మోపినట్లు స్థానిక మీడియా పేర్కొంది. వేల కోట్ల రూపాయల కుంభకోణాలు, అక్రమ జూద కార్యకలాపాల్లో పాల్గొన్న ఈ మాఫియా, తమ వద్ద పనిచేస్తూ తప్పించుకునేందుకు ప్రయత్నించిన 14 మంది చైనీయుల ప్రాణాలను తీసిందనే ఆరోపణలు కూడా ఎదుర్కొంటోంది. ఈ ఘటనల నేపథ్యంలో బాయి ఫ్యామిలీ మాఫియాకు చెందిన నలుగురికి మరణశిక్షను అమలు చేయడం ద్వారా చైనా కఠిన సందేశం ఇచ్చిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## హిందూ దళితులకు ఇండ్లు ఇవ్వాలి

కా తిలా, సిగ్నేచర్ బ్రిడ్జి పరిసరాల్లో ఎక్కువ మంది హిందూ దళితులు నివసిస్తున్నారని పేర్కొంది. అయితే ఆక్రమణల పేరుతో వారి నివాసాలను తొలగించేందుకు అధికారులు ప్రయత్నిస్తుండటంతో వారు నిత్యం భయంతో జీవిస్తున్నారని కోర్టు అభిప్రాయపడింది. ఇలాంటి చర్యలు వారి జీవన భద్రతను మరింత దెబ్బతీస్తాయని స్పష్టం చేసింది. పాకిస్తాన్ నుంచి వచ్చిన హిందూ దళితులకు పౌరసత్వంతో పాటు పునరావాసం, నివాస సదుపాయాలు కల్పించాలని ధర్మాసనం కేంద్రాన్ని ఆదేశించింది. ఆక్రమణల తొలగింపు లేదా అభివృద్ధి పనుల పేరుతో వారి ఇళ్లను కూల్చివేస్తే తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొంటూ, ప్రస్తుతం నివాసాల తొలగింపును నిలిపివేయాలని సూచించింది. ఈ అంశంపై నాలుగు వారాల్లోగా కేంద్ర ప్రభుత్వం తన స్పందన తెలియజేయాలని ఆదేశించింది. ప్రస్తుతం ఈ ప్రాంతాల్లో సుమారు 250 కుటుంబాలు పాకిస్తాన్ నుంచి వలస వచ్చి నివసిస్తున్నాయని, దాదాపు వెయ్యి మంది వరకు హిందూ దళితులు ఉంటారని అంచనా. కొన్నేళ్లుగా భారత్‌లో జీవిస్తున్నప్పటికీ సరైన నివాస భద్రత లేకుండా గడుపుతున్న వీరి పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని సుప్రీంకోర్టు ఈ కీలక ఆదేశాలు జారీ చేసింది

## బంగ్లా జైలు నుంచి విడుదలైన ఏపీ మత్స్యకారులు

చేశారు. అనంతరం వారిని బాగర్‌హాట్ జైలుకు తరలించారు. మత్స్యకారుల అరెస్టు విషయం తెలిసిన వెంటనే బాధిత కుటుంబ సభ్యులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆశ్రయించారు. వారి వినతుల మేరకు భారత దౌత్య అధికారులు బంగ్లాదేశ్ ప్రభుత్వంతో నిరంతర సంప్రదింపులు జరిపారు. ఇరుదేశాల అధికారుల మధ్య చర్చలు కొనసాగిన తర్వాత మత్స్యకారుల విడుదలకు మార్గం సుగమమైంది. విడుదల అనంతరం ఇండియన్ కోస్ట్ గార్డ్ పర్యవేక్షణలో మత్స్యకారులను విశాఖపట్నానికి తరలించారు. అక్కడ స్థానిక పోలీసులకు అప్పగించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన తర్వాత వారిని కుటుంబ సభ్యులకు అప్పగించే ఏర్పాట్లు చేశారు. బంగ్లాదేశ్ బందీ నుంచి మత్స్యకారులను విడిపించడంలో చొరవ చూపిన భారత ప్రభుత్వానికి బాధిత కుటుంబాలు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఆరు నెలల పాటు తీవ్ర ఆందోళనకు గురైన కుటుంబాలకు మత్స్యకారుల సురక్షిత రాక ఊరటనిచ్చినట్లయింది.

# మహాశివరాత్రి పర్వదిన వేడుకలను సమన్వయంతో విజయవంతం చేయాలి




ఆధారంగా చేసుకొని అన్ని ఉత్సవాలు, ధార్మిక కార్యక్రమాల్లో సామాన్య భక్తులకు పెద్దపీట వేయాలన్నదే ప్రభుత్వ ఆశయమన్నారు. ఆధ్యాత్మిక ఆంధ్రప్రదేశ్‌కు శ్రీకారం చుట్టేందుకు ప్రభుత్వం అన్ని ఆలయాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. భక్తులకు సజావుగా, సంతృప్తికరంగా దైవ దర్శనం కల్పించినప్పుడే ప్రభుత్వ చర్యలు విజయవంతమైనట్లవుతాయని స్పష్టం చేశారు. వీఐపీ, వీవీఐపీ దర్శనాలకు ప్రత్యేక స్లాట్లు కేటాయించి, నిర్ణయించిన సమయంలోనే దర్శనం జరిగేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అటవీ సంరక్షణ పరిధిలో ఉన్న ఆలయ ప్రాంతంలో విస్తరణ సాధ్యం కాకపోయినా, భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అడవి మార్గంలో 48 కిలోమీటర్లు నడక దారిలో వచ్చే శివ భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా అటవీ శాఖ అధికారులు పూర్తి సహకారం అందించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రతి శాఖ సమన్వయంతో పనిచేసి సమస్యలను అధిగమించాలని మంత్రి ఆదేశించారు. గత ఏడాది తరహాలోనే ఈ సంవత్సరం కూడా భక్తులకు ఉచిత లడ్డూ ప్రసాదం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 14, 15 తేదీలలో రెండు రోజుల పాటు టోల్ గేట్ల వద్ద వాహనాలకు ఉచిత అనుమతి ఇవ్వాలని సూచించారు. రాత్రి వేళల్లో ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించాలని ఆదేశించారు. సాక్షి గణపతి వద్ద రహదారి విస్తరణకు అవసరమైన స్థలాన్ని అటవీ శాఖ అందించినందున, సంబంధిత అధికారులు తక్షణమే రహదారి పనులు చేపట్టాలని సూచించారు. శ్రీశైలానికి వచ్చి వెళ్లే ప్రతి భక్తుడు సంతృప్తికరంగా దర్శనం చేసుకున్నామన్న భావనతో తిరిగి వెళ్లేలా అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలానికి భారీగా తరలివచ్చే భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకొని అన్ని రకాల భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, అత్యవసర సేవల నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించే వారికి ముందుగా రిజిస్ట్రేషన్ చేయించి, తగిన స్థలాలను కేటాయించాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు. ఉత్సవాల సమయంలో సున్నా ఘటనలు జరిగేలా అప్రమత్తంగా వ్యవహరించాలని పోలీసు అధికారులకు మంత్రి ఆదేశించారు. రోడ్లు భవనాలు, మౌలిక సదుపాయాలు మరియు పెట్టుబడుల శాఖ మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలానికి తరలివచ్చే లక్షలాది భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన అన్ని మౌలిక వసతులను సమకూర్చాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఆత్మకూరు నుంచి దోర్నాల వరకు ఉన్న ప్రధాన రహదారుల మరమ్మతులు, విస్తరణ, గుంతల పూడిక, రహదారి భద్రతా చర్యలతో కూడిన పనులను ఈ నెల 8వ తేదీలోగా పూర్తిచేయాలని స్పష్టం చేశారు. ఉత్సవాల సమయంలో వాహనాల రద్దీ అధికంగా ఉండే నేపథ్యంలో రహదారులు సక్రమంగా ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఎక్కడా ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ముందస్తు ప్రణాళికతో పనులు చేపట్టాలని సూచించారు. భక్తుల సౌకర్యమే లక్ష్యంగా అధికారులు సమిష్టిగా పనిచేసి, ఏ చిన్న లోపం కూడా తలెత్తకుండా సమన్వయంతో వ్యవహరించాలని తెలిపారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా, ఘనంగా, విజయవంతంగా జరిగేలా ప్రతి శాఖ బాధ్యతతో పని చేయాలని మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి అన్నారు.

ఎక్స్-ఆఫిషియో ప్రిన్సిపల్ సెక్రటరీ హరి జవహర్ లాల్, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ లు మాట్లాడుతూ ఈ సారి గతం కంటే 30 శాతం అధిక మంది భక్తులు వస్తున్న నేపథ్యంలో అందుకు తగ్గ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, ఫిబ్రవరి 8 నుంచి మార్చి 18 వరకు నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఖచ్చితమైన ప్రణాళికలతో విధులు నిర్వహించేలా గత సమావేశంలో అధికారులకు ఆదేశాలిచ్చామన్నారు. దేవస్థానం సిబ్బంది, పోలీస్, జిల్లా అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సౌకర్యవంతమైన, సంతృప్తికరమైన దర్శనం కల్పించేలా అన్ని ఏర్పాట్లు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు, శ్రీశైలంలో భక్తుల కోసం చేపట్టిన ఏర్పాట్లను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లాధికారులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

## వైసీపీ కుట్రలను తిప్పికొడదాం

తెలిపారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలని వైఎస్ఆర్‌సీపీ చేస్తున్న కుట్రల పట్ల టీడీపీ శ్రేణులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో వైసీపీ అడ్డంగా దొరికిపోయిందని, ప్రజల ఆగ్రహం నుంచి తప్పించుకునేందుకే ఆ పార్టీ నేతలు బూతుపురాణం, డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. శాంతిభద్రతల సమస్యలను సృష్టించి, అభివృద్ధిని అడ్డుకోవాలన్నదే వైసీపీ అసలు లక్ష్యమని అచ్చెన్నాయుడు ఆరోపించారు. టీడీపీ కార్యకర్తలు ఎవరూ వారి కవ్వింపు చర్యలకు లోనై వారి ఉచ్చులో పడకూడదని సూచించారు. రాష్ట్రంలో అలజడులు సృష్టించి పెట్టుబడిదారులు రాకుండా చేయాలన్న కుట్రను ప్రజలు గుర్తించాలని అన్నారు. అరాచక శక్తులపై నిఘా కొనసాగిస్తూనే, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించాల్సిన బాధ్యత మనపై ఉందని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ప్రజల పక్షాన నిలబడి, ప్రభుత్వ ప్రతిష్టను కాపాడుతూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని టీడీపీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

## నాబార్డ్ నిధులతో రహదారి పనుల పరిశీలన : కందుల దుర్గేష్

**- నిడదవోలు నియోజకవర్గం పెరవలి మండలంలో పర్యటన - నాణ్యత, భద్రతపై అధికారులతో సమీక్ష**

మన గళం, నిడదవోలు : నిడదవోలు నియోజకవర్గం పెరవలి మండలంలో నాబార్డ్ నిధులతో చేపడుతున్న రహదారి నిర్మాణ పనులను రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ పరిశీలించారు. కానూరు నుంచి నడుపల్లికోట వరకు రూ.150 లక్షల వ్యయంతో 1.4 కిలోమీటర్ల పొడవునా నిర్మిస్తున్న రహదారి పనుల పురోగతిని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రహదారి నిర్మాణంలో పాటిస్తున్న నాణ్యతా ప్రమాణాలు, పనుల వేగం, భద్రతా చర్యలపై అధికారులతో మంత్రి చర్చించారు. ప్రజలకు దీర్ఘకాలం ఉపయోగపడేలా నాణ్యమైన పనులు చేయాలని, ఎక్కడా రాజీ పడకుండా ప్రమాణాలు పాటించాలని స్పష్టంగా ఆదేశించారు. అలాగే పనులను వేగవంతంగా పూర్తి చేసి, వీలైనంత త్వరగా



ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కందుల దుర్గేష్ పేర్కొన్నారు. రహదారులు అభివృద్ధి చెందితే రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు, వ్యవసాయ ఉత్పత్తులు, వ్యాపార కార్యకలాపాలకు ఊతం లభిస్తుందని



అన్నారు. నిడదవోలు నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

మంగళవారం
03 - 02 - 2026

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# అంబటి రాంబాబు దిష్టిబొమ్మ దగ్ధం







మన గళండోన్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పై వైసీపీ నాయకుడు అంబటి రాంబాబు అనుచితమైన, అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ, ఈ రోజు సోమవారం డోన్ పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద కూటమి నాయకులు మరియు కార్యకర్తలు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు దిష్టిబొమ్మను దహనం చేస్తూ, ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని, రాష్ట్ర ప్రజల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసే విధంగా ఉన్నాయని నాయకులు పేర్కొన్నారు. ఇలాంటి బాధ్యతారహిత వ్యాఖ్యలు చేయడం తగదని, అలాగే భవిష్యత్తులో ఇలాంటి అసభ్య రాజకీయ వ్యాఖ్యలకు చోటు లేకుండా చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో కూటమి నాయకులు వలసల రామకృష్ణ, పనిరాజు, ఓం ప్రకాష్, చనుగొండ్ల శ్రీరాములు, జయరాముడు, రవి, సలింద్ర శ్రీనివాసులు, భూమ నాగన్న కార్యకర్తలు పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.

# అంబటి రాంబాబు వ్యాఖ్యలు సభ్య సమాజానికే సిగ్గుచేటు

**– ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి**
**(ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్)**



మన గళండోన్ మానవత్వం ఉన్న ఏ వ్యక్తి కూడా అంబటి రాంబాబులా మాట్లాడలేరని, ఆయన వ్యాఖ్యలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి మండిపడ్డారు. ఆయన వాడుతున్న భాష అత్యంత అసభ్యకరంగా ఉందని , ప్రజాస్వామ్య విలువలు తెలియని అంబటి రాంబాబు వంటి వ్యక్తులు రాజకీయాల్లో ఉండటానికి ఏమాత్రం అనర్హులని, ఇలాంటి వారిని సమాజం ఛీత్కరించుకుంటోందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అంబటిని తక్షణమే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నోరు అదుపులో లేని నేతలకు చట్టం తన ప్రతాపం చూపాలని కోరారు. తప్పు చేసిన వారిని మందలించాల్సింది పోయి, అంబటిని పరామర్శించడానికి వెళ్లడం జగన్ మోహన్ రెడ్డి నైజానికి నిదర్శనమని ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి గారు ఎద్దేవా చేశారు. జగన్ తన పార్టీ నేతలకు నేర్పుతున్న సంస్కృతి ఇదేనా? అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి అరాచక నేతలను ఎవరూ సహించరని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని ఆయన స్పష్టం చేశారు. అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలు ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని. గత ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు వైకాపా పార్టీకి కేవలం 11 సీట్లకు పరిమితం చేసిన ఇంకా సిగ్గు రాలేదని, ఇలాంటి వారిని ప్రజలు తరిమికొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి అన్నారు.

# ఇంతియాజ్ భాష ను సస్పెండ్ చేయాలి... సిపిఐ శివయ్య




మన గళం బనగానపల్లె : నంద్యాల జిల్లా సిపిఐ సమితి పిలుపుమేరకు సిపిఐ బనగానపల్లె మండల సమితి ఆధ్వర్యంలో డోన్ సిపిఐ మండల కార్యదర్శి నారాయణ సురేష్ పై దాడికి పాల్పడిన సిఐ సస్పెండ్ చేయాలని ఆయనపై పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని బనగానపల్లె లో సోమవారం ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ డోన్ మండలంలోని తిమ్మాపురం గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో అవినీతి జరిగిందని వాటిని నిరూపించుకో వడానికి గ్రామసభ నిర్వహించడం జరిగింది. గ్రామ సభలో ఎంపీడీవో శ్రీనివాసులు జాతీయ ఉపాధి హామీ పథకంలో అవినీతి జరిగిందని నిజాలు ఒప్పుకోవడం జరిగింది .అది జీర్ణించుకోలేని అధికార పార్టీకి చెందిన కొందరు ఒత్తిడి మేరకు సీఐ ఇంతియాజ్ భాష సిపిఐ నాయకులపై అనుచితంగా ప్రవర్తించడమే కాకుండా దుర్భసలాడుతూ కొట్టడం జరిగింది.ఈ విషయమై డోన్ మండల డిఎస్పి తెలియపరచడం జరిగింది. డీఎస్పీ ఇంతవరకు సీఐ ఇంతియాజ్ భాషాపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు . ఆయన మీద కేసు నమోదు చేయలేదు .ఇప్పటికైనా సిఐ ఇంతియాజ్ భాష పై చర్యలు తీసుకోవాలని సిపిఐ పార్టీగా డిమాండ్ చేస్తున్నాం . లేనిపక్షంలో పార్టీ కలిసి వచ్చే ప్రజా సంఘాలతో కలసి భారీ ఎత్తున ధర్నా కార్యక్రమాలు చేస్తామని వారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి శివయ్య, సిపిఐ సీనియర్ నాయకులు సంజీవులు సిపిఐ మండల సమితి సభ్యులు ఖాదర్, శివ, నాగయ్య, సుబ్రహ్మణ్యం, కుళాయి స్వామి, సుబ్బయ్య, మహేష్ ,ఎమ్మార్పీఎస్ నాయకులు మునయ్య, గడ్డ గాళ్ళ సుబ్బరాయుడు, పసుపల చిన్న స్వామి , కైపా ఈశ్వరయ్య పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

## రైతులకు రాజముద్ర తో పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ...



నందవరం ఫిబ్రవరి 2 మనగళం న్యూస్ : నందవరం మండల పరిధిలోని స్థానిక చిన్నకొత్తిలి గ్రామంలో ఎమ్మెల్యే బివి జయ నాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు చిన్నకొత్తిలి గ్రామంలో సోమవారం మండల రెవెన్యూ అధికారుల రీ సర్వే మహేష్ ఆధ్వర్యంలో రైతులకు రాజముద్ర ఫోటో ఉన్న పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షులు సత్యారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రైతుల ఆస్తులకు మూర్ఖంగా తన ఫోటో వేసుకోవడం జరిగిందన్నారు ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడి రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు అదేవిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గెలిచిన తర్వాత రైతుల పాసు పుస్తకాలు వాటిపై జగన్మోహన్ రెడ్డి ఫోటోను తొలగించి రాజ్యముద్రత కూడిన పాసుపుస్తకాలు పంపిణీ చేయడం జరిగిందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు లక్ష్మి కాంత రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, పరశురాముడు, ప్రేమ్ రాజ్, చంద్రన్న, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ప్రశ్నిస్తే దాడుల?? సిపిఐ నాగాంజనేయులు




మన గళం అవుకు : ప్రశ్నిస్తే దాడులు చేస్తారా అంటూ అవుకు సిపిఐ నాగాంజనేయులు సోమవారం అన్నారు. నంద్యాల జిల్లా డోన్ మండలం సిపిఐ కార్యదర్శి నారాయణ అలాగే తిమ్మాపురం గ్రామ శాఖ కార్యదర్శి సురేష్ లపై డోన్ పట్టణ సిఐ ఇంతియాజ్ భాష ఎస్సై సురేంద్ర కానిస్టేబుల్ నాగరాజు సీతారామయ్యలపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ నంద్యాల జిల్లా సమితి పిలుపుమేరకు అవుకు పట్టణ సమితి ఆధ్వర్యంలో స్థానిక మహాత్మా గాంధీజీ విగ్రహం వద్ద అవు కు సీపీఐ పార్టీ సభ్యులు అలాగే రైతు సంఘం సభ్యులు అలాగే మహిళా సంఘ సభ్యులు నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో అవుకు సీపీఐ సహాయ కార్యదర్శి అందే రమేష్ ,చైతన్య కుమార్, పుల్లయ్య ,రజాక్ భాష, లక్ష్మీనారాయణ, టైలర్ సుదర్శన్, రైతు సంఘం నాయకులు మహిళా సంఘం నాయకురాలు పశువుల చిన్నమ్మ ,రమాదేవి, అలాగే రైతు సంఘం నాయకులు ఎం మద్దిలేటి, రామాంజనేయులు, పెద్దరాజు ,రాముడు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పీఎఫ్‌పై కేంద్రం కొత్త రూల్స్..




హైదరాబాద్ , 02 ఫిబ్రవరి , మనగళం : ఉద్యోగుల భవిష్య నిధి విషయంలో కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కీలక నిర్ణయాలు తీసుకుంది. ఉద్యోగులు, సంస్థలకు ఉపశమనం కలిగించేలా పీఎఫ్ ట్రస్టుల నిర్వహణ నిబంధనల్లో మార్పులు చేసింది. ఈ మార్పులు 01-04-2026 నుంచి అమల్లోకి రానున్నాయని ప్రకటించింది. ఇప్పటివరకు కొన్ని సంస్థలు తమ ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా పీఎఫ్ ట్రస్టులను నిర్వహిస్తున్నాయి. అలాంటి ట్రస్టులకు యాజమాన్యాలు చెల్లించే మొత్తాలపై అమలులో ఉన్న పాత నిబంధనలను పూర్తిగా రద్దు చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది.

ఇంతవరకు ట్రస్టులకు యాజమాన్యాలు చెల్లించే వాటా శాతం, సమానత్వం వంటి అంశాలపై కఠినమైన నిబంధనలు ఉండేవి. ఈ నిబంధనల కారణంగా సంస్థలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని గత కొంతకాలంగా ప్రభుత్వాన్ని కోరుతూ వచ్చాయి. ఈ నేపథ్యంలో బడ్జెట్‌లో ఈ నిబంధనలను తొలగిస్తున్నట్లు ఆర్థిక మంత్రి ప్రకటించారు. దీంతో పీఎఫ్ ట్రస్టులను నిర్వహిస్తున్న కంపెనీలకు గణనీయమైన ఊరట లభించనుంది. వ్యాపార కార్యకలాపాలను సులభతరం చేయాలనే ఉద్దేశంతోనే ఈ మార్పులు తీసుకొచ్చినట్లు ప్రభుత్వం తెలిపింది.

## వీఆర్వోల సంక్షేమం కోసం నిరంతర కృషి చేసిన చింతగుంట్ల సుబ్బరామిరెడ్డికి ఘన సన్మానం

మార్కాపురం జిల్లా , మన గళం : వీఆర్వోల సంక్షేమం కోసం అంకితభావంతో కృషి చేసిన చింతగుంట్ల సుబ్బరామిరెడ్డి సేవలు భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలుస్తాయని రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం కొనియాడింది. ఆయన సేవలను గుర్తించి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా అభినందించారు. తను నిర్వహించే ఉద్యోగంలోని సిబ్బంది పక్షాన నిలబడి, వారి సమస్యలను తనవిగా భావిస్తూ, వారి సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసినప్పుడే ఒక వ్యక్తి నిజమైన నాయకుడిగా గౌరవింపబడతాడని స్టాలిన్ అన్న మాటలను చింతగుంట్ల సుబ్బరామిరెడ్డి తన సేవల ద్వారా ఆచరణలో చూపించారు. నిరంతర శ్రామికుడిగా తన తోటి ఉద్యోగుల బాగోగులను గమనిస్తూ, స్వయంకృషితో నైపుణ్యాలను పెంపొందించుకుంటూ, నిర్దేశించిన లక్ష్యాల సాధనలో చొరవ చూపుతూ తనతో పనిచేసే వారిని సమాయత్తపరచే సామర్థ్యమే నాయకత్వమని నిరూపించారు. ఇలాంటి ఎన్నో నాయకత్వ లక్షణాలు సుబ్బరామిరెడ్డిలో స్పష్టంగా కనిపిస్తాయి. పెద్దారవీడు మండలం గుండంచెర్ల గ్రామానికి చెందిన చింతగుంట్ల సుబ్బరామిరెడ్డి, రెవెన్యూ వ్యవస్థలో గ్రామ కరణం నుంచి గ్రామ రెవెన్యూ అధికారి వరకు వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా తాను పనిచేసిన రెవెన్యూ వ్యవస్థలోని క్రింది స్థాయి సిబ్బంది సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను చేపట్టారు. ప్రత్యేకంగా మార్కాపురం జిల్లా మరియు డివిజన్ కేంద్ర కార్యాలయాలకు విధుల నిమిత్తం వచ్చే గ్రామ రెవెన్యూ అధికారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన సుబ్బరామిరెడ్డి, వాటికి శాశ్వత పరిష్కారంగా ఒక భవనం నిర్మించాలనే సంకల్పం చేశారు. ఈ క్రమంలో మార్కాపురం పట్టణ పరిధిలోని గ్రామ రెవెన్యూ చావిడి స్థలాన్ని గుర్తించి, భవిష్యత్ తరాల గ్రామ రెవెన్యూ అధికారులకు అవసరమైన అన్ని సదుపాయాలతో కూడిన భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. తోటి ఉద్యోగుల సహకారంతో పాటు తన సొంత నిధులను సమకూర్చి, భవన నిర్మాణానికి కావలసిన అన్ని సహాయ సహకారాలను ముందుండి అందించారు. పదవి



విరమణ అనంతరం కూడా బాధ్యతగా వ్యవహరిస్తూ భవన నిర్మాణాన్ని పూర్తి చేసి, దానికి "గ్రామ రెవెన్యూ అధికారుల భవనం" అని నామకరణం చేశారు. సుబ్బరామిరెడ్డి చేసిన విశిష్ట సేవలను గుర్తించి రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ఆధ్వర్యంలో విజయవాడ ఫిల్మ్ ఛాంబర్‌లో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంఘం అధ్యక్షులు భూపతి రాజు, రవీంద్ర రాజు, ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు వై.పి. రంగయ్య, జిల్లా సహాధ్యక్షులు నూనె విజయభాస్కర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చే. ఆదిరెడ్డి తో పాటు ప్రకాశం జిల్లా గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.




## శ్రీశైలం శివరాత్రి బ్రహ్మోత్సవాలు

- బ్రహ్మోత్సవాల సందర్భంగా భద్రతా ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ మరియు ఎస్పీ స్వయంగా పరిశీలన





మనగళం శ్రీశైలం : మహా పుణ్యక్షేత్రమైన శ్రీశైలం నందు నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని, దేశం నలుమూలల నుంచి తరలివచ్చే లక్షలాది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, అధికారులను ఆదేశించారు. సోమవారం శ్రీశైలం క్షేత్రంలో ముఖ్యమైన ప్రాంతాలైన పాతాళగంగ, రోప్‌వే, పార్కింగ్ ప్రదేశాలు, కోనేరు, స్నాన ఘట్టాలు, ఆలయ పరిసర ప్రాంతాలు తదితర ప్రాంతాలను స్వయంగా పరిశీలించారు. భక్తుల రాకపోకలు సజావుగా సాగేలా తీసుకోవాల్సిన చర్యలు, భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, అత్యవసర సేవల అందుబాటు వంటి అంశాలపై సంబంధిత శాఖల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఉత్సవాల సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా శాంతిభద్రతలను కట్టుదిట్టంగా నిర్వహించాలని, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా భక్తుల భద్రతే ప్రథమ లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని, ప్రతి చిన్న అంశంపై కూడా అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ మరియు ఎస్పీ పేర్కొన్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా, సురక్షితంగా, విజయవంతంగా నిర్వహించే దిశగా జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా వారు తెలిపారు.




# 17న పీసీసీ అధ్యక్షురాలు కర్నూలు రాక

- పత్తికొండ, కోడుమూరు నియోజకవర్గాల్లో ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర
- ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర పోస్టర్ విడుదల చేసిన డిసిసి అధ్యక్షుడు బి క్రాంతి నాయుడు




మన గళం,కర్నూలు పాతబస్తీ : ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర పోస్టర్ ను డిసిసి అధ్యక్షుడు బి క్రాంతి నాయుడు విడుదల చేశారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు శ్రీమతి వైఎస్ షర్మిలా రెడ్డి గారు నేడు సోమవారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును యధావిధిగా కొనసాగించాలని కోరుచూ అనంతపురం జిల్లా బండ్లపల్లి గ్రామము నుండి ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర ప్రారంభిస్తున్న సందర్భంగా కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయము నందు డిసిసి అధ్యక్షులు బి క్రాంతి నాయుడు గారు మరియు కాంగ్రెస్ నాయకులు ఉపాధి హామీ పరిరక్షణ పోస్టరు విడుదల చేసిన అనంతరం క్రాంతి నాయుడు గారు మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ ఈ యాత్రలో భాగంగా పిసిసి అధ్యక్షురాలు శ్రీమతి వైయస్ షర్మిల రెడ్డి గారు కర్నూలు జిల్లా పత్తికొండ, కోడుమూరు నియోజక వర్గాలలో యాత్ర సాగుతుందని ఈ యాత్రను కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు రైతులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయవలెనని కోరారు. అనంతరం అనంతపురం జిల్లా బండ్లపల్లికి షర్మిలా రెడ్డి గారు చేపడుతున్న ఉపాధి హామీ పరిరక్షణ యాత్రకు సంఘీభావం తెలుపుటకు బయలుదేరి సంఘీభావం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్ బాబు, సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలాని భాష, కోడుమూరు కోఆర్డినేటర్ అనంతరత్నం మాదిగ, ఐఎన్టీయూసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ఖాద్రి పాషా, ఐ ఎన్ టి యు సి జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ యన్ సి బజారన్న, ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ డివి సాంబశివుడు, మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఏ సూర్య ప్రకాష్ రెడ్డి, ఓబీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, ఐ ఎన్ టి యు సి సిటీ అధ్యక్షులు రేపల్లె ప్రతాప్, మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ కే రాఘవేందర్ రెడ్డి కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ హై, రంగస్వామి మొదలగు వారు పాల్గొన్నారు.




## సామాన్యులకు ఊరట..

హైదరాబాద్ , 02 ఫిబ్రవరి , మనగళం బడ్జెట్ 2026లో కేంద్ర ప్రభుత్వం సామాన్యులకు ఊరట కలిగించే కీలక నిర్ణయం తీసుకుంది. టీవీలు, స్మార్ట్‌ఫోన్ల తయారీలో ఉపయోగించే విడిభాగాలు, ఇతర పరికరాలపై కస్టమ్స్ డ్యూటీని తగ్గిస్తున్నట్లు ఆర్థిక మంత్రి ప్రకటించారు. దీంతో దేశవ్యాప్తంగా టీవీలు, స్మార్ట్‌ఫోన్ల ధరలు త్వరలో తగ్గే అవకాశాలు ఉన్నాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం సామాన్యులు, మధ్యతరగతి ప్రజలు విస్తృతంగా ఉపయోగించే ఈ ఎలక్ట్రానిక్ వస్తువుల ధరలు అధికంగా ఉండటంతో కొనుగోలుపై భారం పడుతోంది. ఇప్పుడు పన్ను రాయితీలతో ఆ భారం కొంత తరిగే అవకాశం కనిపిస్తోంది.

భారత్‌లో టీవీలు, స్మార్ట్‌ఫోన్ల తయారీకి అవసరమైన అనేక విడిభాగాలు విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. వీటిపై కస్టమ్స్ డ్యూటీ తగ్గడంతో తయారీ ఖర్చులు తగ్గి, దాని ప్రభావం వినియోగదారుల ధరలపై పడనుందని అంచనా. ఇదే సమయంలో వంటగదిలో ఉపయోగించే కొన్ని ఎలక్ట్రానిక్ వస్తువుల ధరలు కూడా తగ్గనున్నాయి.

# శ్రీశైలం లో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పర్యటన

మనగళం శ్రీశైలం : నేడు ఉదయం శ్రీశైలం మహాక్షేత్రంలో శ్రీ మల్లికార్జున స్వామి భ్రమరాంబ అమ్మవార్లను దర్శించుకున్న రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆలయ మర్యాదలతో మంత్రికి ఘన స్వాగతం పలికిన దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ కార్యనిర్వాహకులు, సిబ్బంది దర్శనానంతరం మంత్రికి వేద పండితులు వేద ఆశీర్వచనం అనంతరం ఆలయ పరిసరాలు, భక్తులకు అందిస్తున్న సౌకర్యాలు, మౌలిక వసతులను అధికారులతో కలిసి పరిశీలించిన మంత్రి రాబోయే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, పారిశుద్ధ్యం, క్యూ లైన్లు, భద్రతా ఏర్పాట్లు సమర్థవంతంగా నిర్వహించాలని సూచన దర్శనానికి వచ్చిన భక్తులతో మాట్లాడి దేవస్థానం కల్పిస్తున్న సౌకర్యాలపై వారి అభిప్రాయాలు, సూచనలు తెలుసుకున్న మంత్రి శ్రీశైలం మహాక్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేసి అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని వెల్లడించిన మంత్రి భక్తుల సౌకర్యాలే ప్రభుత్వానికి తొలి ప్రాధాన్యమని స్పష్టం చేసిన రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి





మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

## సంక్షేమం పేరుతో బలహీనమవుతున్న భవిష్యత్తు

దేశవ్యాప్తంగా రాజకీయాలు, ఎన్నికలు, ప్రభుత్వ విధానాల మధ్య ఒక పదం ఎప్పుడూ చర్చలో ఉంటుంది. “ఉచిత పథకాలు”. పేదలకు అండగా నిలవడం, అసమానతలను తగ్గించడం అనే లక్ష్యంతో ప్రారంభమైన ఈ పథకాలు, నేడు సమాజాన్ని నిజంగా ముందుకు నడిపిస్తున్నాయా? లేక నెమ్మదిగా అలవాటుగా మారి ప్రజలను ఆధారపడే పరిస్థితికి నెట్టుతున్నాయా? అన్న ప్రశ్న ఇప్పుడు తలెత్తుతోంది.

సంక్షేమ రాజ్యం అనే భావనలో ఉచిత పథకాలకు ఒక నైతికత ఉంది. ఆకలి, నిరుద్యోగం, విద్యా లోపం వంటి సమస్యలతో బాధపడే వర్గాలకు ప్రభుత్వ సహాయం అవసరం అనేది వాస్తవం. ఆహారం, ఆరోగ్యం, విద్య వంటి మౌలిక అవసరాల్లో ప్రభుత్వం జోక్యం చేసుకోవడం సామాజిక న్యాయానికి కీలకం. ఈ కోణంలో చూస్తే ఉచిత పథకాలు తాత్కాలిక ఉపశమనాన్ని ఇస్తూ అనేక కుటుంబాలకు జీవనాధారంగా మారాయి.

అయితే సమస్య అక్కడే మొదలవుతోంది. ఉపశమనం తాత్కాలికంగా ఉండాల్సింది పోయి శాశ్వత అలవాటుగా మారితే ఏమవుతుంది? ప్రభుత్వ సహాయం లేకుండా జీవించలేమనే భావన ప్రజల్లో బలపడితే, వ్యక్తిగత శ్రమ, ఆత్మనిర్భరత, ఉపాధి సృష్టి వంటి అంశాలు వెనక్కి నెట్టబడతాయి. ఉద్యోగం కోసం పోరాడే మనస్తత్వం కంటే, పథకం కోసం ఎదురు చూసే పరిస్థితి పెరుగుతుంది. ఇది సమాజానికి దీర్ఘకాలంలో ప్రమాదకరమైన సంకేతం. ఇంకో ముఖ్యమైన కోణం ప్రభుత్వ ఆర్థిక భారం. ఉచిత పథకాల కోసం భారీగా ఖర్చు చేయడం వల్ల అభివృద్ధి వ్యయాలకు నిధులు తగ్గే ప్రమాదం ఉంది. రహదారులు, పరిశ్రమలు, విద్యా సంస్థలు, పరిశోధన వంటి రంగాల్లో పెట్టుబడులు తగ్గితే, భవిష్యత్తు తరాలకు అవకాశాలు పరిమితం అవుతాయి. ఈ రోజు ఇచ్చే ఉచితం, రేపటి అవకాశాలను హరించకూడదనే సమతుల్యత ప్రభుత్వాలకు అవసరం. ఉచిత పథకాలు పూర్తిగా తప్పు అనడం కూడా సరికాదు. అవి ఎవరి కోసం, ఎంతకాలం, ఏ లక్ష్యంతో అనే స్పష్టత ఉంటేనే అవి ప్రయోజనకరంగా మారతాయి. ఉచితం అనే పదం కంటే, సాధికారత అనే భావన ముందుండాలి. శిక్షణ, ఉపాధి అవకాశాలు, చిన్న పరిశ్రమలకు మద్దతు, విద్య ద్వారా నైపుణ్యాల పెంపు ఇవి ప్రజలను పథకాలపై ఆధారపడకుండా స్వయంపోషితులుగా మారుస్తాయి.

ఈ నేపథ్యంలో సమాజం కూడా ఆత్మపరిశీలన చేసుకోవాలి. మనం సహాయం కోరుతున్నామా, లేక అలవాటుగా మారిపోయామా? ప్రభుత్వాలు ఓట్లు కోసం ఉచితాల పోటీకి దిగితే, ప్రజలు బాధ్యతాయుతమైన పౌరులుగా ప్రశ్నించాల్సిన అవసరం ఉంది. ఉపశమనంతో పాటు దిశ చూపే విధానాలే దేశాన్ని ముందుకు నడిపిస్తాయి.

మొత్తానికి ఉచిత పథకాలు అవసరమే, కానీ అవే లక్ష్యంగా మారకూడదు. ఉపశమనం నుంచి సాధికారత దిశగా ప్రయాణం జరిగితేనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది. లేనిపక్షంలో, ఈ రోజు ఇచ్చే ఉచితం రేపటి భవిష్యత్తుపై భారంగా మారే ప్రమాదం ఉంది. ఆర్థికంగా కూడా ఉచిత పథకాల భారం తక్కువ కాదు. ప్రభుత్వ ఆదాయం పరిమితంగా ఉన్నప్పుడు, భారీ సంక్షేమ వ్యయం అభివృద్ధి వ్యయాలను కుదించేస్తుంది. రహదారులు, పరిశ్రమలు, విద్యా సంస్థలు, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి వంటి రంగాల్లో పెట్టుబడులు తగ్గితే, భవిష్యత్తు తరాలకు అవకాశాలు తగ్గిపోతాయి. ఈ రోజు ఉచితంగా అందిస్తున్న వనరులు, రేపటి తరాలపై అప్పుగా మారే ప్రమాదం ఉంది. సంక్షేమం అభివృద్ధి మధ్య సమతుల్యత లేకపోతే, ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి తప్పదు.

ఉచిత పథకాలకు ప్రత్యామ్నాయం ఏమిటి? సమాధానం ఒకటే సాధికారత. ఉచితం ఇచ్చే బదులు, ఉపాధి కల్పించడం; నగదు పంచే బదులు, నైపుణ్యాలు నేర్పించడం; రాయితీల బదులు, అవకాశాలు సృష్టించడం. విద్య, శిక్షణ, చిన్న పరిశ్రమలకు మద్దతు, వ్యవసాయ విలువ జోడింపు, స్థానిక ఉపాధి ఇవే ప్రజలను స్వయం సమృద్ధులుగా మార్చే మార్గాలు. అప్పుడు సంక్షేమం భారంగా కాకుండా పెట్టుబడిగా మారుతుంది.

ప్రజల పాత్ర కూడా ఇక్కడ కీలకం. సహాయం అవసరమైనప్పుడు తీసుకోవడం తప్పు కాదు. కానీ అదే జీవిత లక్ష్యంగా మారితే సమస్య. పౌరులుగా మనం ప్రశ్నించాలి ఈ పథకం నన్ను నిలబెడుతోందా, లేక నడవనివ్వడంలేదా? ప్రభుత్వాలు కూడా ఆత్మపరిశీలన చేసుకోవాలి ఈ ఖర్చు సమాజాన్ని బలపరుస్తుందా, లేక ఓటు గణితానికే పరిమితమవుతోందా?

మొత్తానికి ఉచిత పథకాలు ఉపశమనానికి అవసరమే. కానీ అవి దిశ లేకుండా కొనసాగితే అలవాటుగా మారతాయి. ఉపశమనం నుంచి సాధికారత వైపు ప్రయాణం జరిగితేనే నిజమైన సంక్షేమం. ప్రజలను ఆధారపడే వారిగా కాకుండా, నిలబడే వారిగా మార్చడమే పాలన యొక్క అసలైన విజయం.

# క్రీడా సమస్యలపై గళమెత్తిన కర్నూలు ఎం.పి.బస్తిపాటి నాగరాజు

మన గళం,కర్నూలు క్రీడలు : క్రీడా రంగంలో నెలకొన్న అనేక సమస్యలను కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు పార్లమెంట్ లో లేవనెత్తారు, పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలలో భాగంగా ప్రశ్నోత్తరాల సమయం( కోష్టిన్ హావర్) లో మాట్లాడిన ఆయన సమస్యలపై ప్రశ్నించారు... కర్నూలులోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయి ) కేంద్రంలో ప్రాథమిక మౌలిక సదుపాయాలు ఉన్న ప్పటికీ, యువ ప్రతిభను అభివృ ద్ధి చేయడానికి అవసరమైన సౌకర్యా లు మరియు ఆధునిక శిక్షణ సదుపాయాలు లోపిస్తున్నాయన్నారు..ఈ నేపథ్యం లో కర్నూలు జిల్లాలోని ఆదోని పట్టణం లో ఆరు లైన్లతో కూడిన 400 మీటర్ల సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ ఏర్పా టు చేయాలనే ప్ర తిపాదనను 2021--22 సం వత్స రం లో మంత్రిత్వ శాఖకు ఇప్పటికే సమర్పిం చారని తెలిపారు, ఈ సందర్భం గా, ప్రస్తుత బడ్జెట్ లో క్రీ డల మం త్రి త్వ శాఖకు కేటాయిం పులు పెరిగిన దృష్ట్యా ,కర్నూ లులో క్రీ డా పర్యావరణ వ్యవస్థ అభివృద్ధి కోసం ఈ ప్రాజెక్టుకు ఆమోదం ఇవ్వబడుతుందా అని కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మండవియాను ప్రశ్నించగా, దీనికి సమాధానంగా మంత్రి సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ ఏర్పాటును పరిశీలిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా యం పి నాగరాజు పార్లమెంట్ భవనం వెలుపట కేంద్ర క్రీడా మంత్రిని కలసి కర్నూలు సాయి సెంటర్ ను కర్నూల్ నుండి తరిలించకూడదువినతి పత్రం అందజేశారు ,



అనేక మంది క్రీడాకారులు జాతీయ అంతర్ జాతియా క్రీడాకారులు గా కర్నూలు సాయి హాస్టల్ నుండి ప్రాతినిధ్యం వహించారని సాయి హాస్టల్ కు కావలిసిన మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి పత్రం అందజేశారు.

# భారతీయ జనతా పార్టీ నాయకులు తో సున్నిపెంట రోడ్డు పరిశుభ్రం







మనగళం శ్రీశైలం : భారతీయ జనతా పార్టీ – ఆంధ్రప్రదేశ్ జనతా వారధి కార్యక్రమం లో భాగంగా శ్రీశైల మండలంలోని స్థానిక సుండిపెంట గ్రామం నందు రోడ్ల వెంట చెత్త చెదారం పేరుకుపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని భారతీయ జనతా పార్టీ శ్రీశైల మండల అధ్యక్షులు చదువుల శ్రీను తెలిపారు. చెత్తను సకాలంలో తొలగించకపోవడం కారణంగా గ్రామంలో దుర్వాసన,దోమలు,ఈగలు అధికంగా పెరిగి ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పాఠశాల పిల్లలు, వృద్ధులు,మహిళలు ఈ సమస్య వల్ల ఎక్కువగా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గ్రామ పరిశుభ్రత లోపించడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని గ్రామంలోని అవసరమైన ప్రదేశాలలో చెత్త బుట్టలు ఏర్పాటు చేయాలని, అలాగే సకాలంలో చెత్తను సేకరించి,తరలించే విధంగా తక్షణ చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ తరపున సంబంధిత అధికారులను కోరుతూ ప్రజా పరిష్కార వేదికలో వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు వేములశ్రీను,చిక్కుడుచెట్టు వెంకటేశ్వర్లు,మండ్ల రామకృష్ణ, యేసుదాసు,చిత్రాల శివసాయి, ఆనంద్ మరియు ఇతర పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు బిసి రాజారెడ్డికి ఆహ్వానం





మన గళం బనగానపల్లె : ఈనెల 14వ తేదీ నుంచి 18వ తేదీ వరకు యాగంటి క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు బిసి రాజారెడ్డి చేతుల మీదుగా గోడపత్రికను విడుదల చేయించిన ఆలయ చైర్మన్ ఈవో జిల్లాలో ప్రముఖ శైవ క్షేత్రమైన యాగంటిలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డిని ఆహ్వానించారు ఈమేరకు ఆలయ చైర్మన్ మౌళిశ్వర్ రెడ్డి ఈవో పాండురంగారెడ్డి లు బిసి రాజారెడ్డిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేసి బ్రహ్మోత్సవాలు హాజరుకావాలని కోరారు ఈ సందర్భంగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన గోడపత్రికలను బిసి రాజారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు ఈనెల 14వ తేదీ నుండి 18వ తేదీ వరకు యాగంటి క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు వారు తెలిపారు 14వ తేదీ ధ్వజారోహణముతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని 15వ తేదీ మహాశివరాత్రి 16వ తేదీ నందికోల ఉత్సవం 17వ తేదీ శ్రీ స్వామివారి రథోత్సవం 18వ తేదీ శివదీక్ష విరమణ పూర్ణాహుతి నాగవల్లి వసంతోత్సవం తెప్పోత్సవం ధ్వజ అవరోహణముతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని బిసి రాజారెడ్డి ఆలయ అధికారులకు సూచించారు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వస్తారని వారికి త్వరితగతిన స్వామి వార్ల దర్శనమయ్యేలా చూడాలని తెలిపారు

# 30 వేల మందికి లేఆఫ్స్‌కు ఒరాకిల్ సిద్ధం

న్యూ ఢిల్లీ , 02 ఫిబ్రవరి , మనగళం : అమెరికా బ్యాంకులు డేటా సెంటర్ విస్తరణకు నిధులు సమకూర్చడంలో వెనుకడుగు వేయడంతో టెక్ దిగ్గజం ఒరాకిల్ తన వ్యయ వ్యూహాన్ని తిరిగి సమీక్షిస్తోంది. ఈ క్రమంలో సంస్థ తన వర్క్ ఫోర్స్ నుంచి 20 వేల నుంచి 30 వేల వరకు ఉద్యోగులను తగ్గించే యోచనలో ఉందని పెట్టుబడి సంస్థ టిడి కోవెన్ వెల్లడించింది. కృత్రిమ మేధస్సు మౌలిక సదుపాయాల విస్తరణకు అవసరమైన నిధులను సమకూర్చుకోవడమే ఈ నిర్ణయాల వెనుక ప్రధాన ఉద్దేశమని విశ్లేషకులు చెబుతున్నారు.

ఉద్యోగాల కోత ద్వారా ఒరాకిల్‌కు సుమారు 8 నుంచి 10 బిలియన్ డాలర్ల వరకు నగదు ప్రవాహం ఆదా కావచ్చని నివేదిక పేర్కొంది. కొంతవరకు తీరే అవకాశం ఉందని అంచనా.

# అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన వైయస్ఆర్‌సీపీ నేతలు

**– కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, డాక్టర్ ఆది మూలపు సతీష్**





మన గళం కోడుమూరు: కోడుమూరు పట్టణంలో వెలసిన శ్రీ శ్రీ శ్రీ చౌడేశ్వరి దేవి తిరునాలను పురస్కరించుకుని సోమవారం ఉదయం భక్తి శ్రద్ధలతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైయస్ఆర్‌సీపీ నేతలు కోట్ల హర్షవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారికి పట్టు వస్త్రాల సమర్పణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్ , మాజీ ఎమ్మెల్యే మణిగాంధీ తదితర పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పట్టు వస్త్రాల సమర్పణ అనంతరం తేరుబజారు – లింగమయ్య ఇంటి సమీపం నుండి ఊరేగింపును నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి నామస్మరణతో పరిసర ప్రాంతాలను మార్మోగించారు. డప్పులు, మంగళవాయిద్యాల మధ్య నిర్వహించిన ఈ ఊరేగింపు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, అమ్మవారి ఆశీస్సులతో కోడుమూరు పట్టణం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైయస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మన ఊరు మన జాతర లో వాలీబాల్ మరియు గోణే సంచి పోటీలు





మన గళం కోడుమూరు: శ్రీ చౌడేశ్వరి దేవి తిరునాల సందర్భంగా జరుగుతున్న క్రీడలు సాంస్కృతిక కార్యక్రమాల లో భాగంగా సోమవారం గోనేసంచితో పరిగెత్తే పోటీలు జరిగాయి. ఈ పోటీలను కోడుమూరు ట్రాన్స్ కో ఏ ఈ మధుసూదన్ ప్రారంభించారు. కోడుమూరు కోట్ల సర్కిల్ లో ఈ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో 47 మంది పాల్గొన్నారు. గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ 3016, రెండవ బహుమతి గా రూ 2016, మూడవ బహుమతిగా రూ 1016 లు నగదుగా విజేతలకు ఇవ్వడం జరుగుతుంది. ఈ పోటీలకు దాతలుగా వైష్ణవి పెయింట్స్ దస్తగిరి ఉన్నారు. ఈ పోటీల్లో జూనియర్స్ ముగ్గురిని, సీనియర్స్ ముగ్గురిని విజేతలుగా ప్రకటించడం జరుగుతుంది. సీనియర్స్ లో భాస్కర్ మొదటి స్థానం, వీరేష్ రెండవ స్థానం, కేశవ మూడవ స్థానం సాధించారు. జూనియర్స్ లో శ్రీధర్, శీలం వరుణ్, శీలం ఋషి విజయం సాధించారు.

అలాగే కోడుమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో వాలీబాల్ పోటీలు ప్రారంభం అయ్యాయి. కోడుమూరు సి ఐ మహమ్మద్ తబ్రేజ్, ఎస్ ఐ డి వై స్వామి, పలువురు అధికారులు, జర్నలిస్ట్ లు, శ్రీ చౌడేశ్వరి దేవి తిరునాల క్రీడలు సాంస్కృతిక కార్యక్రమాల స్టీరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.ఈ పోటీల్లో పాల్గొనేందుకు మహిళల జట్లు 20, పురుషుల జట్లు 20 మొత్తం 40 టీం లు పాల్గొంటున్నాయి. వాలీబాల్ బాలుర విభాగంలో మొదటి బహుమతి దాత స్వర్గీయ రాజా వర్ధన్ రెడ్డి జ్ఞాపకార్థం కోడుమూరు మండల ప్రధాన కార్యదర్శి వెంకటగిరి రాజు రూ 30,000 అందజేయనున్నారు ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు మరియు ప్రభుత్వ అధికారులు మరియు కమిటీ సభ్యులు పాల్గొన్నారు

# తిరుమల లడ్డూపై తప్పుడు ప్రచారాలు..అసత్యాలతో ఫ్లెక్సీలు దారుణం

**– కోడుమూరు పోలీసులకు డాక్టర్ ఆదిమూలపు సతీష్ ఫిర్యాదు**






మన గళం కోడుమూరు: పవిత్రమైన తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంపై తప్పుడు ప్రచారాలు, ఎన్‌డీడీబీ రిపోర్టుపై అసత్య ఆరోపణలు చేస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం దుర్మార్గమని కోడుమూరు నియోజకవర్గ వైయస్ఆర్‌సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ మండిపడ్డారు. తిరుమల లడ్డూపై ఆధారరహిత ఆరోపణలు అన్నీ అసత్యమని సీబీఐ రిపోర్టు స్పష్టం చేసినప్పటికీ, కావాలనే తప్పుడు ప్రచారాలు చేస్తూ అసత్యాలతో కూడిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ సోమవారం కోడుమూరు సబ్ ఇన్‌స్పెక్టర్‌కు ఆదిమూలు సతీష్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆదిమూలపు సతీష్ మాట్లాడుతూ, కావాలనే రెచ్చగొట్టే విధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్న వారిని గుర్తించి, విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను కోరామని తెలిపారు. రాష్ట్రంలో ఆటవిక పాలన రాజ్యమేలుతోంది. ఎక్కడ చూసినా దోపిడీలు, దౌర్జన్యాలు, హత్యాయత్నాలు జరుగుతున్నాయి" అని మండిపడ్డారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తిరుమల లడ్డూపై నిరాధారమైన ఆరోపణలు చేయడం దుర్మార్గమన్నారు. లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిందంటూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు లడ్డూ వ్యవహారంలో గత ప్రభుత్వంలో పనిచేసిన వైయస్ జగన్ మోహన్ రెడ్డి, వై.వి. సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డిలపై నిందలు మోపే ప్రయత్నం చేశారని, అయితే సీబీఐ, సిట్ విచారణలు, అలాగే ఎన్‌డీడీబీ, ఎన్‌డీఆర్‌ఐ, రిపోర్టులు జంతువుల కొవ్వు కలవలేదని స్పష్టంగా నిర్ధారించాయని గుర్తు చేశారు. నిజాలు బయటపడిన తరువాత కూడా అదే అసత్యాలను ఫ్లెక్సీలు, బ్యానర్ల రూపంలో ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. భూమన కరుణాకర్ రెడ్డి, వైవీ సుబ్బారెడ్డిలను నిందితులుగా చూపిస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం పూర్తిగా తప్పు అని అన్నారు. ఫ్లెక్సీలు తొలగించాలని కోరితే, మాజీ మంత్రుల ఇళ్లపై దాడులు చేయడమేనా? తప్పులను ప్రశ్నిస్తే చంపేస్తారా? అని తీవ్రంగా నిలదీశారు. ఆరు గంటలపాటు అంబటి రాంబాబు ఇంటిపై దాడులు జరుగుతుంటే పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించారని, అలాగే జోగి రమేష్ ఇంటిపై పెట్రోల్ బాంబులు వేయడం రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ చూడని దుశ్చర్య అని విమర్శించారు. పచ్చగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను కూటమి పాలనలో రావణకాష్టంలా రగిలిపోతున్న మరో బీహార్‌గా మార్చేస్తున్నారు అని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి రఘునాథ్ రెడ్డి, మండల కన్వీనర్ రమేష్ నాయుడు, జిల్లా రైతు విభాగం ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, కోడుమూరు నియోజకవర్గం సాంస్కృతిక విభాగం అధ్యక్షులు, మాజీ ఉప సర్పంచ్ ప్రవీణ్ కుమార్, మాజీ ఎంపీటీసీ లింగన్న,వార్డు సభ్యులు విష్ణు దాస్, హనుమంతు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశ్రీశ్రీ చౌడేశ్వరి మాత తిరుణాల ఉత్సవం





మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు నందు శ్రీశ్రీశ్రీ చౌడేశ్వరి దేవి మాత తిరుణాల ఉత్సవం ఎంతో కన్నుల వైభవంగా జరిగింది ఈ జాతర సందర్భంగా కోడుమూరు నందు గ్రామీణ సాంస్కృతిక క్రీడా అభివృద్ధి కమిటీ వారు 18 రకాల కార్యక్రమాలు చేపట్టారు అలాగే రథోత్సవ వేడుకలలో అనేకమంది భక్తులు పాల్గొని శ్రీ శ్రీ శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారి తీర్థ ప్రసాదాలు తీసుకుని వారి కృపకు పాత్రులయ్యారు.

# గృహ నిర్మాణం కొరకు విరాళం

**– శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానం పూజారి గృహ నిర్మాణం కొరకు విరాళం**



మన గళం బనగానపల్లె : బనగానపల్లె మండలం పలుకూరు గ్రామంలో శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానం పూజారి గృహ నిర్మాణం కొరకు విరాళం 20000 వేల రూపాయలను శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యులకు గుండం నాగిరెడ్డి కుమారుడు గుండం భాస్కర్ రెడ్డి గారు ఇవ్వడం జరిగింది గతం లో గుడి నిర్మాణం కొరకు 50000 వేల రూపాయలు విరాళంగా ఇవ్వడం జరిగింది మొత్తం గా 70000 వేల రూపాయలను ఆలయ కమిటీ సభ్యులకు ఇవ్వడం జరిగింది.

# బడ్జెట్ దెబ్బ నుంచి కోలుకున్న స్టాక్ మార్కెట్లు



ముంబై , 02 ఫిబ్రవరి, మన గళం : బడ్జెట్ రోజున తీవ్రంగా పతనమైన దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం ట్రేడింగ్‌లో బలంగా పుంజుకున్నాయి. ట్రేడింగ్ చివరి గంటలో భారీ షేర్లలో కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 944 పాయింట్లు పెరిగి 81,666 వద్ద స్థిరపడగా నిఫ్టీ 263 పాయింట్లు లాభపడి 25,088 వద్ద ముగిసింది.

ఈరోజు ట్రేడింగ్‌లో మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 80,387 కనిష్ఠ స్థాయికి పడిపోగా ఆ తర్వాత బలమైన రికవరీతో 1,345 పాయింట్లు ఎగబాకి 81,732 గరిష్ఠాన్ని తాకింది. నిఫ్టీ కూడా 24,679 కనిష్ఠం నుంచి కోలుకుని 25,108 స్థాయికి చేరింది. అదానీ పోర్ట్స్, భారత్ ఎలక్ట్రానిక్స్, ఎల్ అండ్ టీ, మహీంద్రా అండ్ మహీంద్రా, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వంటి ప్రధాన షేర్లలో చివరి గంటలో బలమైన కొనుగోళ్లు కనిపించాయి.

2020 తర్వాత బడ్జెట్ రోజున మార్కెట్లు అత్యంత దారుణంగా పతనం కావడం గమనార్హం కాగా, ఒక్కరోజులోనే ఈ స్థాయి రికవరీ రావడం పెట్టుబడిదారుల్లో నమ్మకాన్ని పెంచింది. మార్కెట్లలో భయాన్ని సూచించే సూచీ 8 శాతం తగ్గింది. పవర్‌గ్రిడ్ షేరు 7.6 శాతం లాభంతో సెన్సెక్స్‌లో అత్యధిక లాభం నమోదు చేసింది. మధ్యస్థ, చిన్న స్థాయి షేర్ల సూచీలు కూడా లాభాల్లో ముగిశాయి. ఆటో, మెటల్, రియల్టీ రంగాలు లాభపడగా సమాచార సాంకేతిక రంగం స్వల్ప నష్టాల్లో ముగిసింది.

ఇదిలా ఉండగా కమోడిటీ మార్కెట్‌లో వెండి ధరలు భారీగా పతనమయ్యాయి. ఎంసీఎక్స్‌లో వెండి ఫ్యూచర్స్ ధర 6.4 శాతం తగ్గి కిలో 2,48,600కు చేరింది. బంగారం ధరలు మాత్రం దాదాపు స్థిరంగానే కొనసాగాయి.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక



# నానికి జోడీగా బుట్టబొమ్మ.. ఫస్ట్ టైం ఫ్రెష్ కాంబో..!

హైదరాబాద్ ,02 ఫిబ్రవరి , మన గళం, : తెలుగు సినీ పరిశ్రమలో మరో ఆసక్తికర ప్రాజెక్ట్‌కు రంగం సిద్ధమవుతోంది. నేచురల్ స్టార్ నాని, సాహో ఫేం దర్శకుడు సుజీత్ కాంబినేషన్‌లో కొత్త సినిమా తెరకెక్కనున్నట్లు సమాచారం. సహజ నటనతో పాటు ప్రయోగాత్మక చిత్రాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నాని ఈసారి పూర్తిగా భిన్నమైన స్టైలిష్ యాక్షన్ అవతారంలో కనిపించనున్నాడని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి.

ఈ చిత్రానికి హీరోయిన్‌గా బుట్టబొమ్మగా గుర్తింపు తెచ్చుకున్న పూజా హెగ్డేను ఎంపిక చేసినట్టు టాక్ నడుస్తోంది. నాని, పూజా హెగ్డే తొలిసారి జోడీ కట్టనుండటంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఫ్రెష్ కాంబినేషన్ కావడంతో పాటు స్టైలిష్ యాక్షన్ కథాంశంతో సినిమా రూపొందనుందని తెలుస్తోంది.

ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఈ ఏడాది జూన్ నుంచి ప్రారంభం కానుండగా, గ్రాండ్ స్థాయిలో నిర్మించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారని సమాచారం. థియేట్రికల్ రిలీజ్‌ను 2027లో లక్ష్యంగా పెట్టుకున్నారని టాక్. నాని కెరీర్‌లో మరో డిఫరెంట్ ప్రాజెక్ట్‌గా నిలవనున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.

# బ్రేకప్ గురించి బయటపెట్టిన మృణాల్ ఠాకూర్..!




హైదరాబాద్ , 02 ఫిబ్రవరి ,మన గళం : సీతారామం సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన మృణాల్ ఠాకూర్ తొలి చిత్రంతోనే నటిగా మంచి ప్రశంసలు అందుకుంది. ఆ తర్వాత హాయ్ నాన్న చిత్రంతో మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. అయితే ఇటీవల కొంతకాలంగా ఆమె వ్యక్తిగత జీవితానికి సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారుతున్నాయి. ముఖ్యంగా ఆమె పెళ్లి గురించి రూమర్లు నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి.

ఈ నేపథ్యంలో గతంలో ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న మృణాల్ తన ప్రేమ, బ్రేకప్ గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు మళ్లీ వైరల్ అవుతున్నాయి. ఆ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ గతంలో తాను ఒక వ్యక్తిని ప్రేమించానని, కానీ తాను హీరోయిన్ అని తెలిసిన తర్వాత అతడు తనను వదిలేశాడని చెప్పింది. నువ్వు హీరోయిన్‌వి, నిన్ను ఆ విధంగా చూడలేనని చెప్పి అతడు సంబంధాన్ని ముగించాడని ఆమె వెల్లడించింది.

ఆ బ్రేకప్ తన జీవితానికి మంచే చేసిందని మృణాల్ అభిప్రాయపడింది. అప్పట్లో అది బాధ కలిగించినా, లేదంటే భవిష్యత్తులో మరిన్ని సమస్యలు ఎదురయ్యేవని తెలిపింది. ప్రస్తుతం ఆ నిర్ణయాన్ని తాను పాజిటివ్‌గా తీసుకున్నానని చెప్పింది.


ఇక కెరీర్ విషయానికి వస్తే మృణాల్ ప్రస్తుతం హిందీలో వరుస సినిమాలతో బిజీగా ఉంది. అలాగే అడివి శేష్‌తో కలిసి డెకాయిట్ సినిమాలో నటిస్తోంది. వ్యక్తిగత జీవితంపై వస్తున్న వార్తలపై అధికారికంగా స్పందించకపోయినా, ఆమె చేసిన ఈ బ్రేకప్ వ్యాఖ్యలు మాత్రం అభిమానుల్లో చర్చకు దారి తీస్తున్నాయి.

# మ్యాడ్ 3'కు రంగం సిద్ధం..




హైదరాబాద్ ,02 ఫిబ్రవరి, మన గళం :టాలీవుడ్‌లో యూత్‌ఫుల్ కామెడీ ఎంటర్‌టైనర్‌లుగా భారీ విజయాలు అందుకున్న మ్యాడ్, మ్యాడ్ 2 చిత్రాలు బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్లుగా నిలిచిన విషయం తెలిసిందే. దర్శకుడు కళ్యాణ్ శంకర్ తెరకెక్కించిన ఈ సిరీస్ ఫన్, ఫ్రెండ్‌షిప్, కాలేజ్ బ్యాక్‌డ్రాప్‌తో యువతను విపరీతంగా ఆకట్టుకుంది. నార్నె నవీన్, రామ్ నితిన్, సంగీత్ శోభన్ హీరోలుగా నటించి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోగా, ఈ ఫ్రాంచైజీకి గట్టి ఫ్యాన్ బేస్ ఏర్పడింది. ఇప్పుడు ఈ సక్సెస్‌ను కొనసాగిస్తూ మూడో భాగాన్ని తెరపైకి తీసుకురావడానికి మేకర్స్ సిద్ధమవుతున్నారు.

ఈసారి మ్యాడ్ 3ను పూర్తిగా కొత్త కాన్సెప్ట్‌తో పాటు కొత్త నటీనటులతో రూపొందించాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నట్లు తెలుస్తోంది. గత చిత్రాల్లో కనిపించిన హీరోల స్థానంలో కొత్త తరం యువ నటులను పరిచయం చేయనున్నారని సమాచారం. ఈ కొత్త కాస్టింగ్‌లో లిటిల్ హార్ట్స్ ఫేం జేయ్ కృష్ణ, కోర్ట్ ఫేం హర్ష్ రోషన్ పేర్లు వినిపిస్తున్నాయి. ఫ్రెష్ ఫేస్‌లతో యంగ్ ఎనర్జీని మరింత పెంచాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నారని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఇదే సమయంలో ఈ చిత్రానికి మ్యాడ్ జూనియర్స్ అనే టైటిల్‌ను ఫిక్స్ చేయాలని మేకర్స్ భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. టైటిల్ ద్వారానే ఇది కొత్త తరం కాలేజ్ యువత కథగా ఉండబోతుందనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఈ మూవీ షూటింగ్ ప్రారంభమైనట్లు సమాచారం కాగా, త్వరలోనే ఫస్ట్ లుక్, టీజర్ వంటి అప్డేట్స్ విడుదల చేసే అవకాశం ఉందని టాక్. మ్యాడ్, మ్యాడ్ 2 చిత్రాల మాదిరిగానే ఈ భాగంలోనూ హాస్యం, ఫ్రెండ్‌షిప్, కాలేజ్ లైఫ్ అంశాలు ప్రధానంగా ఉండనున్నాయని అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. వరుస విజయాలతో దూసుకెళ్తున్న ఈ నిర్మాణ సంస్థ నుంచి వస్తున్న మరో యూత్ ఎంటర్‌టైనర్ కావడంతో మ్యాడ్ జూనియర్స్‌పై ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. కొత్త క్యాస్టింగ్‌తో ఈ సినిమా ఎంతవరకు ఆకట్టుకుంటుందో చూడాలి.




# బాక్సాఫీస్‌పై 'బోర్డర్ 2' దూకుడు..

హైదరాబాద్ ,02 ఫిబ్రవరి ,మన గళం : బాలీవుడ్‌లో క్లాసిక్ యుద్ధ చిత్రంగా నిలిచిన బోర్డర్‌కు సీక్వెల్‌గా వచ్చిన బోర్డర్ 2 బాక్సాఫీస్ వద్ద జైత్రయాత్రను కొనసాగిస్తోంది. సన్నీ డియోల్ ప్రధాన పాత్రలో, అనురాగ్ సింగ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ పీరియడ్ యుద్ధ చిత్రం ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. దేశభక్తి భావోద్వేగాలు, సైనికుల త్యాగాలు, యుద్ధ సన్నివేశాల భీకరతతో ఈ సినిమా భారీ స్థాయిలో ఆదరణ పొందుతోంది. విడుదలైన పది రోజుల్లోనే ఈ చిత్రం కీలకమైన మైలురాయిని అందుకోవడం విశేషంగా మారింది.

రెండో ఆదివారం రోజున ఒక్కరోజే 24.22 కోట్ల నెట్ వసూళ్లు సాధించిన బోర్డర్ 2, భారత్‌లో ప్రతిష్టాత్మకమైన 300 కోట్ల క్లబ్‌లోకి ఘనంగా అడుగుపెట్టింది. తాజా లెక్కల ప్రకారం దేశవ్యాప్తంగా ఈ సినిమా మొత్తం నెట్ వసూళ్లు 301.89 కోట్లకు చేరుకున్నాయి. వారాంతపు హైప్ తర్వాత పని దినాల్లో వసూళ్లు ఎలా కొనసాగుతాయన్నది ట్రేడ్ వర్గాల్లో ఆసక్తిగా మారినా, తొలి రెండు వారాల్లోనే ఈ స్థాయి వసూళ్లు సాధించడం సినిమాకు ఉన్న బలమైన క్రేజ్‌ను స్పష్టంగా చూపిస్తోంది.

ఇదిలా ఉండగా ఈ ఘన విజయం నేపథ్యంలో మేకర్స్ మరో కీలక ప్రకటన చేశారు. బోర్డర్ ఫ్రాంచైజీకి కొనసాగింపుగా బోర్డర్ 3ను అధికారికంగా ప్రకటిస్తూ అభిమానులకు సర్‌ప్రైజ్ ఇచ్చారు. ఈ ప్రాజెక్ట్‌ను టీ సిరీస్ మరియు జెపి ఫిల్మ్స్ సంయుక్తంగా నిర్మించనుండగా, వరుణ్ ధావన్, దిల్జీత్ దోసాంజ్, అహన్ శెట్టి, మోనా సింగ్, సోనమ్ బజ్వా కీలక పాత్రల్లో నటించనున్నట్లు వెల్లడించారు. మొత్తంగా దేశభక్తి కథాంశంతో రూపొందిన బోర్డర్ 2 బాక్సాఫీస్ వద్ద తన సత్తా చాటుతూ రికార్డులు సృష్టిస్తోంది. రాబోయే రోజుల్లో ఈ సినిమా ఇంకా ఎంత స్థాయిలో వసూళ్లు సాధిస్తుందన్నదానిపై సినీ వర్గాల్లో భారీ ఆసక్తి నెలకొంది.

# ఇది.. ప్రజలందరికీ ఆమోదయోగ్యమైన బడ్జెట్

– అన్ని రంగాలకూ పెద్ద పీట వేశారు – మీడియా సమావేశంలో భాజపా నేతలు















మన గళం,కర్నూలు నరసింహారెడ్డి నగర్) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ ప్రజలందరికీ ఆమోదయోగ్యమైన బడ్జెట్ అని భాజపా నేతలు స్పష్టం చేశారు. సోమవారం నగరంలోని స్థానిక నరసింహారెడ్డి నగర్ లో ఉన్న హీరా ఇన్ సర్వీస్ అపార్ట్ మెంట్స్ లో ఉన్న మినీ ఫంక్షన్ హాల్ లో బడ్జెట్ పై ఆ పార్టీ నేతలు పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భాజపా కర్నూలు జిల్లా అధ్యక్షుడు అక్కమ్మతోట రామక్రిష్ణ మాట్లాడుతూ ఈ బడ్జెట్ అన్ని రంగాలకూ ఉపకరించేలా ఉందన్నారు.వైద్యం, ఆరోగ్యం, విద్యుత్,రవాణా, హోంశాఖ ,తదితర అన్ని రంగాలకూ ఈ బడ్జెట్ లో పెద్ద పీట వేశారన్నారు. అంతే కాకుండా వ్యవసాయ రంగానికి సైతం బడ్జెట్ కేటాయింపుల్లో ప్రాధాన్యమిచ్చారన్నారు. ఏ.పి.ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ ఫ్రా స్ట్రక్చర్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ డైరెక్టర్, భాజపా నేత నగరూరు రాఘవేంద్ర మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి బడ్జెట్ లో 12 లక్షల కోట్లు కేటాయింపులు చేయడం చూసి ప్రపంచ దేశాలు నివ్వెరపోయాయన్నారు. ప్రతిపక్షాలకు ఈ బడ్జెట్ ఓ చెంపపెట్టు లాంటిదన్నారు. హైవేలు,రైల్వేలు,స్పీడ్ కారిడార్ఇలా ఢిల్లీ నుంచి ముంబాయి, పూనే,హైదరాబాద్ టు చెన్నై,బెంగుళూరు టు చెన్నై,మైసూర్..ఇలా కనెక్టివిటిని పెంచేలా కేటాయింపులు జరిగాయని ఆయన చెప్పారు. రేర్ ఎర్త్ మెటల్స్ వెలికితీతకు,పారిశ్రామిక హబ్ ఏర్పాటు,తద్వారా ఉపాధి అవకాశాల పెంపుదలకు ప్రాధాన్యం ఇచ్చారన్నారు. బయో ఫార్మాకు,యం.ఎస్.యం.ఇ.లకు చెరో రూ.10 వేల కోట్ల కేటాయింపులు చేయడం హర్షణీయమన్నారు. ఆయుర్వేద ఔషధాల ఉత్పాదనకు సబ్సిడీలు, ప్రోత్సాహకాలను ఈ బడ్జెట్ ద్వారా భాజపా ప్రభుత్వం అందజేయనుందన్నారు. రాష్ట్ర బిజెవైఎం అధ్యక్షుడు సునీల్ రెడ్డి మాట్లాడుతూ ఈ బడ్జెట్ ప్రవేశపెట్టిన రోజు ఓ సుదినమన్నారు. ప్రజల ఆర్థిక సుస్థిరత,ప్రజల ఆకాంక్షలు నెరవేరేలా, వారి శక్తి,సామర్థ్యాలు పెరిగేలా అందరికీ సమ ప్రాధాన్యమిస్తూ సబ్ కా సాత్ సబ్ కా వికాస్ అనేలా ఈ బడ్జెట్ కేటాయింపులు జరిగాయన్నారు. ప్రపంచ చరిత్రలో ఎక్కడా జరుగని రీతిగ ప్రజలకు, యువత ఆలోచనలకు పరిగణనలోకి తీసుకున్నది భాజపా ప్రభుత్వమేనన్నారు. భాజపా రాష్గ నాయకురాలు గీతామాధురి మాట్లాడుతూ రైల్వే జోన్, ప్రయాణించే సమయం తగ్గేలా,రైల్వే ట్రాక్స్ పటిష్టతకు,నిర్వహణకు బడ్జెట్ లో ప్రాధాన్యమిచ్చారన్నారు. వ్యవసాయం లాభసాటిగా మారేలా చర్యలు తీసుకున్నారన్నారు. జిల్లా మాజీ అధ్యక్షుడు పోలంకి రామస్వామి మాట్లాడుతూ వ్యాపారాలు సులభతరమయ్యేలా ,ఎం.ఎస్.ఎం.ఇ.లకు రూ.10 వేల కోట్లు కేటాయింపులు జరగడం హర్షణీయమన్నారు. దేశం సత్వర ప్రగతి సాధించేందుకు ఈ బడ్జెట్ ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో భాజపా నాయకుడు, వాల్మీకి కార్పోరేషన్ డైరెక్టర్ మురళీనాయుడు, నాయకులు మాలతి, తదితరులు పాల్గోన్నారు.

## టీ20 ప్రపంచకప్ హిస్టరీలో తోపు ప్లేయర్లు వీళ్లే భయ్యో..




ముంబై ,02 ఫిబ్రవరి 2026, మన గళం : టీ20 ప్రపంచకప్ అంటేనే పరుగుల వర్షం. పొట్టి ఫార్మాట్‌లో ప్రపంచ స్థాయి బౌలర్లను ఎదుర్కొని నిలకడగా పరుగులు చేయడం అంత ఈజీ కాదు. 2007లో ప్రారంభమైన ఈ మెగా టోర్నీలో ఎంతోమంది దిగ్గజ ఆటగాళ్లు తమ సత్తా చాటారు. ఫిబ్రవరి 2026 నాటికి అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం టీ20 ప్రపంచకప్ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన టాప్ 5 ఆటగాళ్లు వీరే. ఈ జాబితాలో భారత్‌కు చెందిన ఇద్దరు ఆటగాళ్లు ఉండటం విశేషం. అగ్రస్థానంలో విరాట్ కోహ్లీ నిలిచాడు. అతడు టీ20 ప్రపంచకప్‌ల్లో మొత్తం 1292 పరుగులు చేశాడు. అద్భుతమైన స్థిరత్వం, ఒత్తిడిలోనూ రాణించే స్వభావంతో విరాట్ ఈ రికార్డును సాధించాడు. ఒకే ప్రపంచకప్‌లో అత్యధిక పరుగులు చేసిన ఘనత కూడా అతడికే దక్కింది. రెండో స్థానంలో రోహిత్ శర్మ ఉన్నాడు. 1220 పరుగులతో హిట్‌మ్యాన్ ఈ జాబితాలో నిలిచాడు. 2007 నుంచి అన్ని ప్రపంచకప్‌ల్లో ఆడిన ఆటగాడిగా రోహిత్ ప్రత్యేక గుర్తింపు సంపాదించాడు. ఓపెనర్‌గా జట్టుకు వేగవంతమైన ఆరంభాలు ఇవ్వడంలో అతడు కీలక పాత్ర పోషించాడు. మూడో స్థానంలో శ్రీలంక దిగ్గజం మహేళ జయవర్ధనే ఉన్నాడు. అతడు టీ20 ప్రపంచకప్‌ల్లో 1016 పరుగులు సాధించాడు. క్లాసిక్ బ్యాటింగ్‌తో టీ20ల్లో కూడా విజయం సాధించవచ్చని నిరూపించిన ఆటగాడు జయవర్ధనే.

నాలుగో స్థానాన్ని ఇంగ్లాండ్ స్టార్ బ్యాటర్ జోస్ బట్లర్ దక్కించుకున్నాడు. 1013 పరుగులతో టాప్ 5లో నిలిచిన అతడు, ఈ జాబితాలో ఉన్న యాక్టివ్ ఆటగాడిగా కొనసాగుతున్నాడు. దూకుడైన ఆటతో ప్రత్యర్థులకు ఎప్పుడూ ముప్పుగా మారే ఆటగాడు బట్లర్.

ఐదో స్థానంలో ఆస్ట్రేలియా విధ్వంసకర ఓపెనర్ డేవిడ్ వార్నర్ ఉన్నాడు. అతడు 984 పరుగులు చేశాడు. ఆస్ట్రేలియా తొలి టీ20 ప్రపంచకప్ విజయంలో వార్నర్ కీలక పాత్ర పోషించాడు. మొత్తంగా టీ20 ప్రపంచకప్ చరిత్రలో టాప్ 5 పరుగుల వీరుల జాబితాలో భారత్‌కు చెందిన ఇద్దరు ఆటగాళ్లు ఉండటం దేశ అభిమానులకు గర్వకారణంగా మారింది. రాబోయే ప్రపంచకప్‌లో ఈ రికార్డులు మరింత మారుతాయా అనే ఆసక్తి అందరిలోనూ నెలకొంది.

Printed,edited,published and owned by Nagaruru Raghavendra, Printed At : Global Printers, D.No 10 MIE Industrial Estate, Kallur, Kurnool. AP.
Published From H.NO.45/139, Narasimha Reddy Nagar, Kurnool-518004.A.P. Mobile Number : 9160686078. RNI NO. AP TEL/2007/74310.